శన'కాలు పట్టేస్తున్నాయ్'!

కాలనీలోని కిరాణా షాపునకు వెళ్లాలంటే భయం. రోడ్డుపై నడవాలంటే ఆందోళన. నిత్యం వెళ్లే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిందే. రాత్రి వేళ అయితే పరిస్థితి మరింత భయానకం. దీనికి కారణం వీధి కుక్కలే. ఏ కుక్క కరిచినా ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. గాలివీడులో రోజురోజుకు వీధి కుక్కల బెడద స్థానికులను వేధిస్తోంది.

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- భయాందోళనలో ప్రజలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు


గాలివీడులో స్వైర విహారం చేస్తున్న వీధికుక్కలు

గాలివీడు : పట్టణంలో కుక్కలు బాబోయ్.. కుక్కలు అంటూ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు భయంతో బహిరంగ ప్రదేశాల్లో సంచరించలేని పరిస్థితి ఏర్పడింది. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు రహదారిపై వెళ్లడం కూడా ప్రమాదకరంగా మారింది. ఎందుకంటే వీధి కుక్కలు ఆకస్మికంగా దాడి చేస్తుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. ఏడాది కాలంలో సుమారు 200లకు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి అంటే గాలివీడులో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఇటీవలే రేబిస్ సోకిన కుక్కలు పలువురిపై దాడి చేసి, తీవ్ర గాయాలపాలుజేశాయి. ఈ కారణంగా ప్రజల్లో మరింతగా భయం పెరిగింది. పిల్లలను బయటకు పంపాలంటే ఆలోచించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, అలానే వాటిని పట్టి టీకాలు వేయించాలని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే, పరిస్థితి మరింత విషమించి ప్రజల భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేసి గాయపరుస్తున్న వీధికుక్కలను పట్టి అటవీ ప్రాంతంలో వదిలేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే అనేకమార్లు పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. – గుండ్లూరి మస్తాన్ బాబు, గాలివీడు

పాదచారులపై దాడి చేస్తున్నాయి

పట్టణంలో ప్రధాన రహదారిపై వీధికుక్కలు గుంపులుగుంపులుగా చేరి పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడికి తెగబడుతున్నాయి. ముఖ్యంగా చికెన్ సెంటర్ల వద్ద వ్యర్థాల కోసం గుమికూడి ఉంటున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. – ఆవుల శివారెడ్డి, గాలివీడు

వైఎస్సార్ తెలుగు ప్రజల గుండె చప్పుడు


మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: మాజీ ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు ప్రజల గుండె చప్పుడు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మహానేత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయన భౌతికంగా మన మధ్యలేకపోయినా ఆయన చూపిన మార్గం, అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, 104, ఇళ్ల పంపిణీ, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి పథకాలు లక్షలాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. వెలిగల్లు, జరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులు ఆయన చొరవతోనే నిర్మితమయ్యాయని పేర్కొన్నారు. రాయచోటి వాసులపై వైఎస్సార్‌కు ప్రత్యేక మమకారం ఉండేదన్నారు. పట్టణ దాహార్తినీ తీర్చే విధంగా చేపట్టిన నీటి పథకాలు, రింగ్ రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాల, పలు విద్యాసంస్థలు అభివృద్ధికి చిరునామాగా నిలిచాయన్ని గుర్తు చేశారు. మహానేత 16వ వర్ధంతి సందర్భంగా అందరం ఆయనను సేవలను స్మరించుకుంటూ గౌరవంగా నివాళులు అర్పిద్దామని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సజీవం


మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహానేత వర్ధంతిని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక కార్యాలయంలో, వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 6 సంవత్సరాలు ప్రజలకు సువర్ణ పాలన అందించి సంక్షేమ పథకాలతో దేశంలోనే చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు. పేదలు, రైతుల గురించి ఆలోచించి వారి అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్సార్ ఒక్కరేనని అన్నారు. వైఎస్సార్ సువర్ణ పాలన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని తెలిపారు. కూటమి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఉమ్మడి కడప జిల్లాను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. సంక్షేమం వెల్లువై సాగిందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ అవకాశాలపై అవగాహన


హరీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న బిట్స్ కళాశాల చైర్మన్, అధ్యాపకులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలంలో ఉన్న భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) కళాశాలలో జపాన్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపాన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఎన్ఐసీటీ)లో సహాయ పరిశోధకుడిగా ఏఐ రంగంలో నిష్ణాతులైన హరీష్ కుమార్ పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన జపాన్‌లోనే ఎంఎస్ చదవడం, ఉద్యోగాలను సంపాదించే ప్రక్రియపై అమూల్యమైన మార్గదర్శకాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎసిఎస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ స్వాతి


రాయచోటి జగదాంబసెంటర్ : హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను నిర్మూలిద్దామని వీఆర్ హైస్కూల్ ఏఓ రజని విమల అన్నారు. ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని వీఆర్ హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖవ్యాధులు, చికిత్స గూర్చి, కండోమ్ యొక్క ఉపయోగాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి, ఓఆర్‌డబ్ల్యూ సుహాసిని, పీఈటీ శివరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సీడీపీఓ వాణిశ్రీ

సిద్దవటం : బాలల సంరక్షణ అందరి బాధ్యత అని కడప అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ వాణిశ్రీ అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 1098, మిషన్ వాత్సల్య స్కీములపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ అధికారిణి సునీత మాట్లాడుతూ పిల్లలను ఆపద నుంచి కాపాడేందుకు 1098కు కాల్ చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ శోభారాణి, ఉపాధ్యాయురాలు సునీత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వరలక్ష్మీ దేవి, శ్రీ విద్య, ఏఎన్ఎం అంజనమ్మ, ఎంఎస్‌కె శోభాలత, ఆశా కార్యకర్త, ఓబులమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, షమీన పాల్గొన్నారు.

పరామర్శ


చిన్నసంజీవయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు తండ్రి అబ్బవరం వెంకటరమణ మృతిపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సంతాపం తెలిపారు. దశదిన ఖర్మకాండ కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన ఎగువ అబ్బవరం హరిజనవాడలో రామాంజులు నివాసానికి వెళ్లి వెంకటరమణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదే విధంగా రాయచోటి పట్టణానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ బీసీ నాయకుడు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిన్న సంజీవయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కారకార్యదర్శి జాఫర్‌అలీఖాన్, కౌన్సిలర్ ఆనందరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్, పట్టణ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో భవిష్యత్ నిర్మాణం

కురబలకోట : ఎన్‌సీసీతో భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని చిత్తూరు 35–ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్.వి. మోనిష్ అన్నారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఎన్‌సీసీ ఉపయోగాలు కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

ఓబులవారిపల్లె: అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాజంపేట పర్యటన సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వామపక్ష నేతలను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి చిన్నయ్య, బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి ఉన్నారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి వినతిపత్రం ద్వారా విన్నవించడం తప్పా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని వామపక్షాల నేతలను వెంటనే విడుదల చేయాలని కోరారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బొప్పాయి రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలనుకున్న నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం పార్టీ రైల్వేకోడూరు మండల నాయకులు లింగాల యానాదయ్య, సీనియర్ నాయకులు ఎం.సుబ్బరామయ్య అన్నారు.

కేంద్రీకృత వంటగది ఏర్పాటుపై ఫిర్యాదు

సిద్దవటం : సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కేంద్రీకృత వంటగది ఏర్పాటుపై పీఆర్జీఎస్‌లో ఫిర్యాదు చేయడంపై పంచాయతీరాజ్ ఏఈ బెదిరించినట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా సెక్రటరీ డాక్టర్ హరికొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తాను కడపకు వెళ్లి పీఆర్జీఎస్‌లో ఒక అర్జీ ఇచ్చానని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో గ్రౌండ్ తక్కువగా ఉందని కేంద్రీకృత వంటగదిని మరోచోట నిర్మించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ తరఫున డీఆర్ఓ, డీఈఓ ఆఫీసు ఏఓను పిలిచి సమస్యను పరిష్కరించమని కోరామన్నారు. తద్వారా కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని ఏఓ సమస్యను ఎంఈఓ–2 దృష్టికి తీసుకెళ్లి అక్కడ గ్రౌండ్ చిన్నదిగా ఉందని, వేరేచోట ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన పంపితే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుంటామని చెప్పడం జరిగిందన్నారు. కానీ ఇంతలోనే వారు కలెక్టర్ ఆఫీసులో ఆన్‌లైన్ చేసేటప్పుడు రశీదును రిలేటివ్ పంచాయతీరాజ్ శాఖ అని రశీదు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో పంచాయతీరాజ్ ఏఈ ఫోన్ చేసి తనను బెదిరించారని వాపోయాడు.

తైక్వాండోలో ప్రతిభ


తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లోని జవహర్ బాలకేంద్రం విద్యార్థులు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభకనబరిచారు. అండర్–10 బాలికల విభాగంలో కుందన్ సాయి, రామసుస్మిత, అండర్–14 బాలుర విభాగంలో హేమంత్, కార్తవార్జున్, పునీత్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. యువరామ్‌రెడ్డి, ఆరీఫ్, తేజశంకర్‌రెడ్డి వెండి పతకాలు, జూనియర్ బాలికల విభాగంలో సుకీర్తనరెడ్డి, యోగిత, జాహ్నవి కాంస్య పతకాలు సాధించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో గౌరీష్ కుమార్, దక్షిస్‌కుమార్, సిద్ధార్థరెడ్డి, జోగీశ్వర్, ఆదిల్, వేదాభిరామ్ రెడ్డి, జీవన్‌రెడ్డి, దివీస్, అజీమ్‌లు కాంస్య పతకాలు సాధించారు. వీరిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ మునీశ్వర్, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ అభినందించారు.

గణనాథుడి కృపతో వర్షాలు సమృద్ధిగా కురవాలి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : గణనాథుడి కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. రామాపురం మండల కేంద్రంలోని నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో సోమవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలని సూచించారు.

అన్నదానం

వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా సోమవారం జెడ్పీటీసీ మాసన వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కార్యక్రమ నిర్వాహకులను జెడ్పీటీసీ, శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. సర్పంచులు అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు సత్యాయాదవ్, చెన్నారెడ్డి, యూత్ కేశగాని మాధవ్, జోగి శివాజీ, మద్రి నాగేష్, శివ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రాయచోటి టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ మున్సిపాలిటీ పరిధిలో నివాస స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని 11వ వార్డు సచివాయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బ్రతుకులు మారలేదని చెప్పారు. కొందరు పేదలు 20 సంవత్సరాలుగా ఆదిరెడ్డి రైస్ మిల్లు సమీపంలో ఒక ప్రైవేట్ స్థలంలో పూరి గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటరు కార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణ ప్రాంతంలో అయితే రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో అయితే 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామని చెప్పారు. వాటి నిర్మాణాల కోసం రూ.5లక్షలు ఇస్తామని కూడా హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మద్రి సుమిత్ర, సీపీఐ పట్టణ కార్యదర్శి చుక్క జగన్ బాబు, పి. ఆంజనేయులు పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా.. పార్వతీ తనయా


గాలివీడు : శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు


పెనగలూరు: ఊరేగింపుగా వెళుతున్న లంబోదరుడు

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, ఇండ్లూరు దళితవాడలో ఏర్పాటు చేసిన వినాయకుడిని సోమవారం నిమజ్జనం చేశారు. ఐదురోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురవీధుల్లో కోలాటం ఆడుతూ గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు.

లడ్డూ వేలం

ఇండ్లూరు దళితవాడలో సోమవారం స్వామివారిని లడ్డూను వేలం వేశారు. మొగిలి సుబ్బరాయుడు రూ. 55 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందరికీ పంచిపెట్టారు.

నందలూరు : మండలంలోని గాంధీనగర్‌లో, ఆర్ఎస్ రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద వినాయ చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆరు రోజుల పాటు పూజలు నిర్వహించి సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

లడ్డూ రూ.42,500

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గాంధీనగర్‌లోని ఆంజనేయ స్వామి వద్ద వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ రూ.42,500 ధర పలికింది. అదే గ్రామానికి చెందిన గాదెన అరుణ్‌కుమార్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అరుణ్‌కుమార్‌ను మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం అర్చకులు సరస రవికుమార్ ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.2.81 లక్షలు పలికిన లడ్డూ

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన వినాకయ మండపం వద్ద సోమవారం స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంపాటలో ఓర్సు మోహన్‌బాబు రూ.2.81 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అదే విధంగా ఫ్రూట్స్‌ను రూ.1.25 లక్షలకు జయచంద్ర సొంత చేసుకున్నారు. స్వామికి నైవేద్యంగా పెట్టిన చెరుకుగడలు రూ.1.25 లక్షలు ధర పలికాయి.

గణేశ్ లడ్డూను దక్కించుకున్న హీరో భరత్

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని కాకులవరం గ్రామం, మునిరెడ్డిగారిపల్లిలో వినాయకుడి లడ్డూను సినీ హీరో భరత్ రూ. 1,00,116లకు దక్కించుకున్నారు. సోమవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా వేలంపాటలో స్వామివారి లడ్డును హీరో భరత్ దక్కించుకోవడంతో గ్రామస్తులు గజమాలతో సత్కరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పుల్లంపేట మండలంలో..

పుల్లంపేట: పుల్లంపేట మండలం, అనంతంపల్లి పంచాయతీలోని జానకీపురం గ్రామంలో శ్రీ మహాగణపతి 13వ వార్షికోత్సవ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో స్వామివారిని లడ్డూను కోడూరు వాసు, అఖిల్‌లు రూ. 25 వేలకు దక్కించుకున్నారు.

కోలాహలంగా గణపతి శోభాయాత్ర

గాలివీడు : గణపతి నిమజ్జనోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కోలాహలంగా శోభాయాత్ర నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో ఆరవ రోజైన సోమవారం పట్టణంలోని శెట్టివారిపల్లె, చిలకలూరిపేట, హైస్కూల్, టెంకాయ చెట్ల బజారులో ఉన్న వినాయకులుతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భారీ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. గేటు నాలుగురోడ్ల కూడలి నుంచి హైస్కూల్ మీదుగా బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలి వరకూ బాణసంచాతో డీజే పాటలు, కోలాటాలు, డప్పువాయిద్యాల నడుమ చిన్న, పెద్ద, యువత కేరింతలు కొడుతూ ఉత్సాహం నత్యాలు చేస్తూ బొజ్జగణపయ్యను నిమజ్జనానికి సాగ నంపారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లడ్డూ రూ.96,500

పట్టణంలోని టెంకాయ చెట్ల బాజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి రెండు లడ్డూల ధర రూ.96,500 పలికింది. అందులో కంచుకొమ్మల నాగరాజు రూ.40 వేలకు, కొబ్బెర నాగేశ్వర రూ.56,500 మరో లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు.


చిన్నమండెం: స్వామివారి లడ్డూ ప్రసాదంతో ఓర్సు మోహన్‌బాబు కుటుంబసభ్యులు


లక్కిరెడ్డిపల్లె: స్వామివారి లడ్డూను దక్కించుకున్న సినీ హీరో భరత్


నందలూరు : నిమజ్జనానికి ట్రాక్టర్‌పై తరలివెళ్తున్న గణనాథుడు